అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వెంకటాచలం: జంగాలపల్లిలో సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న జంగాలపల్లి, పలుకూరువారిపాళెం, ఇడిమేపల్లి గ్రామాల్లో గురువారం మంత్రి కాకాణి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి రూ.54 లక్షల చెక్కులను, పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మించుకుంటున్న గిరిజనులకు ఒక్కొక్కరికి వడ్డీ లేని రుణాల కింద రూ.35 వేలను మంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన గ్రామ వలంటీర్లు పింఛన్‌ లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్‌ నగదు అందజేస్తున్నారని తెలిపారు. అలాగే పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయడంతోపాటు పట్టాలు పంపిణీ చేస్తున్న ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతోపాటు అదనంగా వడ్డీ లేని రుణాన్ని రూ.35 వేలు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా గిరిజన లబ్ధిదారులకు తన సొంత నిధులు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందించి ఇళ్లు నిర్మించుకునేలా చూస్తున్నామని తెలిపారు.

చంద్రబాబును నమ్మే ప్రసక్తే లేదు

రెండు నాల్కుల ధోరణితో రోజుకోవిధంగా మాట్లాడే చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలతో రాష్ట్రంపై ఆర్థికభారం పడుతుందని ఒకరోజు, సంక్షేమ పథకాలు తాము కూడా కొనసాగిస్తామని మరొక రోజు చంద్రబాబు చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రుణమాఫీల పేరుతో రైతులను, మహిళలను మోసం చేసిన చంద్రబాబు రావాలని ఎవరూ కోరుకోరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ కృష్ణ, ఎంపీడీఓ సుస్మిత, వైస్‌ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, రాపూరు అంకయ్య, సర్పంచ్‌ ఉప్పు యశస్విని, నాయకులు ఉప్పు భూపయ్య, పల్లిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మనుబోలు మండలం అనుపల్లిపాడు గ్రామంలో బుధవారం రాత్రి మంత్రి కాకాణి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ప్రజలను ఆరా తీశారు. సమస్యలున్న చోట వెంటనే పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. చుక్కల భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. అంతకుముందు గురివిందపూడి సర్పంచ్‌ మన్నెమాల సమతమ్మ – సుధీర్‌రెడ్డి దంపతులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, తహసీల్దార్‌ సుధీర్‌, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెమాల శ్రీహరిరెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, చేవూరు ఓసూరయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి పరామర్శ

తోటపల్లిగూడూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంత్రి కాకాణి గురువారం మండలంలోని వెంకన్నపాళెం, కొత్తపాళెం గ్రామాల్లో పలువురు పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. వెంకన్నపాళెం సర్పంచ్‌ చింతా సుబ్రహ్మణ్యం తల్లి శేషమ్మ మృతిచెందడంతో వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అలాగే వెంకన్నపాళేనికే చెందిన పార్టీ కార్యకర్త పంది ఏడుకొండలు తల్లిని కోల్పోయిన క్రమంలో ఆ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అదేవిధంగా కొత్తపాళెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అంగిలీకం సుబ్రహ్మణ్యం ఇటీవల మృతిచెందడంతో ఆయన కుమారుడు మహేంద్రను, కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్‌ ఉప్పల శంకరయ్యగౌడ్‌, నాయకులు కావలిరెడ్డి రంగారెడ్డి, దువ్వూరు గంగాధర్‌రెడ్డి, చింతా సుబ్రహ్మణ్యం, వెంకటశేషయ్య, కంజి శ్రీరాములు, ముక్కంటి వీరరాఘవయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాబాకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అలంకరణ, అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో బాబా భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శేజ్‌ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కొడవలూరు: మండలంలోని టపాతోపు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంఈఓ జి.వసంతకుమారి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ గత నెల 19వ తేదీ నుంచి ప్రభుత్వం సరికొత్త రుచులతో జగనన్న గోరుముద్ద మెనూలో మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. నూతన మెనూ కచ్చితంగా అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించామన్నారు. ఎక్కడైనా మెనూ అమలులో లోపాలు జరిగితే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆమె వెంట హెచ్‌ఎం డీవీ సరోజ ఉన్నారు.

బంగారంతో వ్యక్తి ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్‌): బంగారు దుకాణంలో నమ్మకంగా పనిచేస్తూ బంగారంతో వ్యక్తి ఉడాయించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పొగతోటకు చెందిన వరుణ్‌ మండపాలవీధిలో జ్యువెలరీ షాపును నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద రబ్బానీ 2007 నుంచి క్లర్క్‌గా పనిచేస్తూ ఎంతో నమ్మకంగా ఉండసాగారు. గత నెల 30న షాపు యజమాని 700 గ్రాముల బంగారాన్ని మనోజ్‌ బట్టీ షాపులో ఇవ్వాలని రబ్బానీకి అందజేశారు. ఇదే అదునుగా భావించిన రబ్బానీ బంగారంతో ఉడాయించారు. గంటలు గడుస్తున్నా దుకాణానికి రబ్బానీ రాకపోవడంతో వరుణ్‌కు అనుమానం వచ్చింది. ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో బట్టీ వద్దకు వెళ్లి విచారించారు. అక్కడికి రాలేదని తేలడంతో రబ్బానీ కోసం గాలించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కూల్‌డ్రింక్స్‌ షాపు ధ్వంసం

నెల్లూరు(క్రైమ్‌): డబ్బులివ్వమని అడిగినందుకు గానూ కూల్‌డ్రింక్స్‌ షాపులోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు నిర్వాహకులను అసభ్య పదజాలంతో దూషించిన ఇద్దరిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని శ్రీరంగరాజపురానికి చెందిన మస్తానమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు ఆత్మకూరు బస్టాండ్‌ సమీపంలోని ఓ బార్‌ వెనుక వైపు కూల్‌డ్రింక్స్‌ షాపును నిర్వహిస్తున్నారు. గత నెల 29వ తేదీ రాత్రి సత్యనారాయణపురానికి చెందిన రాఘవ, ప్రవీణ్‌ అక్కడికి వచ్చి కూల్‌డ్రింక్స్‌, చిప్స్‌ ఇవ్వాలని కోరారు. డబ్బులివ్వాలని ఆమె అడగ్గా, తమనే అడుగుతావా అంటూ సదరు వ్యక్తులు కూల్‌డ్రింక్స్‌ షాపులోని వస్తువులను ధ్వంసం చేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను ఎందుకు కొడుతున్నారన్నందుకు దాడి

నెల్లూరు(క్రైమ్‌): కుక్కను ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించిన మహిళపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎఫ్‌సీఐ కాలనీలోని వాటర్‌ ట్యాంక్‌ సమీపంలో పావని తన తల్లి ప్రేమకుమారితో కలిసి నివాసం ఉంటున్నారు. నెల రోజులుగా కుక్కను ఆమె పెంచుకుంటున్నారు. కుక్కను గురువారం బయటకు వదలగా, వారి ఇంటికి ఎదురుగా ఉంటున్న రవి కర్రతో దాన్ని కొట్టబోయారు. ఇంతలో బయటకెళ్లిన పావని ఆయన్ను ప్రశ్నించారు. దీంతో రవి రాయి విసరడంతో ఆమె భయపడి ఇంట్లోకి వెళ్లి తలుపులేసుకున్నారు. కొద్దిసేపటి అనంతరం రవి, మరికొందరు ఆమె ఇంటి తలుపులను పగలగొట్టి కర్రతో దాడి చేశారు. ఘటనలో గాయపడిన బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

వెంకటాచలం: మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లెలో 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. జంగాలపల్లె గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం పర్యటించగా, ఆయన సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి కాకాణి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బహిరంగ వేలం పాటలు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆ ఆలయంలో వివిధ హక్కులకు సీల్డ్‌ టెండర్లు, బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌ దొడ్ల మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీల్డ్‌ టెండర్ల ద్వారా రూ.1,44,445లకు విద్యుద్దీపాలంకరణ హక్కును దగదర్తి మండలం తురిమెర్ల గ్రామానికి చెందిన హరిబ్రహ్మ లైటింగ్‌ వారు దక్కించుకున్నారని తెలిపారు. అలాగే బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటరమణ ఫ్లవర్‌ డెకరేషన్‌ వారు రూ.2,99,095లకు పువ్వుల సరఫరా, అలంకరణ హక్కులను దక్కించుకున్నారని తెలిపారు. వీటితోపాటు బహిరంగ వేలం పాటల ద్వారా తాత్కాలిక అంగళ్ల ఏర్పాటు, బాడుగ వసూళ్ల హక్కులను మణికంఠ అనే వ్యక్తి రూ.13,20,000లకు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ తదితరులు

ఇందుకూరుపేట: మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌ రహిత ఏపీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీటికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్‌ పోటీల విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట: నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన కోవూరు నియోజకవర్గ గ్రిగ్స్‌ షటిల్‌ పోటీల్లో విజేతలుగా నిలిచిన కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.మల్లికార్జున గురువారం ఆ పాఠశాలలో అభినందించారు. బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎం.సురేఖ, ఏడో తరగతి విద్యార్థిని పి.రేష్మ విజేతలుగా నిలిచారు. బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు పి.రేష్మంత్‌, పి.హరిహరన్‌ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ క్రమంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.అరోరాను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు



మాట్లాడుతున్న ఏపీఎం రవిశేఖర్‌రెడ్డి

ఇందుకూరుపేట: పొదుపు మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలకు సంబంధించి ఎవరికీ ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఏపీఎం రవిశంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మైపాడులో గురువారం డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళ కోసం ప్రభుత్వం వీఓఏలను ఏర్పాటు చేసిందని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, రుణాలు అందించడం వారి బాధ్యత అని తెలిపారు. రుణాలు అందించే క్రమంలో ప్రయాణ చార్జీలు, ఖర్చుల నెపంతో పొదుపు మహిళల నుంచి నగదు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నగదు డిమాండ్‌ చేస్తే అధికారులకు లేదా ట్రోల్‌ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అక్షరాస్యతతో జీవనోపాధి మెరుగు



అక్షర చైతన్యం కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు: అక్షరాస్యతతో మెరుగైన జీవనోపాధి పొందే అవకాశం ఉంటుందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న అక్షర చైతన్యం కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అక్షరాస్యత వల్ల ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవచ్చని, తద్వారా ఆ పథకాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధి మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. నిరక్షరాస్యులు అక్షర చైతన్యం కేంద్రాలకు క్రమం తప్పకుండా రావడం వల్ల అక్షరాస్యులుగా మారుతారని తెలిపారు. బోధకులు ప్రత్యేక శ్రద్ధతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ జి.వసంతకుమారి, సర్పంచ్‌ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శి జాలయ్య ఉన్నారు.

'ఆయుష్మాన్‌ భారత్‌'పై అవగాహన పెరగాలి



కొత్తవంగల్లులో సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని

కొడవలూరు: 'ఆయుష్మాన్‌ భారత్‌'పై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, అందుకు సచివాలయ ఉద్యోగులు తమవంతు కృషి చేయాలని డీఎల్‌డీఓ ఎస్‌.కనకదుర్గాభవాని సూచించారు. మండలంలోని కొత్తవంగల్లు సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఆయుష్మాన్‌ భారత్‌ కార్డు పొందిన వారికి ఎక్కడి కార్పొరేట్‌ హాస్పిటల్‌లోనైనా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తారని తెలిపారు. వలంటీర్‌ మ్యాపింగ్‌ అనంతరం వైద్యశాఖ లాగిన్‌లో ఈ కార్డును రూపొందిస్తారన్నారు. చాలాచోట్ల లాగిన్‌ కానందున, అవగాహన లేమి కారణాలతో వీటి నమోదు బాగా తక్కువగా ఉందన్నారు. అదేవిధంగా వివాహం చేసుకొన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలని, వివాహం చేసుకొన్న వారి పేరును రేషన్‌కార్డులో నమోదు చేయాలన్నా ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని తెలిపారు. గతేడాది అక్టోబర్‌ 1వ తేదీ నుంచి సచివాలయాల్లోనే వివాహ ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వివాహం చేసుకున్న రెండు నెలల లోపు అయితే సచివాలయంలోనే వివాహ ధ్రువీకరణ పత్రం పొందవచ్చన్నారు. అంతకుమించితే రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ వి.నాగరాజు ఉన్నారు.

5న ప్రసన్న వెంకటేశ్వర స్వామి కల్యాణం

పొదలకూరు: పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం ఈ నెల 5వ తేదీ సాయంత్రం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు గురువారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 9 గంటలకు అన్న ప్రసాదాల వితరణ ఉంటాయని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఈ నెల 5న శంకుస్థాపన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.12 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉచిత గ్యాస్‌ కనెక్షన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు: మండలంలో అర్హులై ఉండి ఉచిత గ్యాస్‌ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నగేష్‌కుమారి గురువారం తెలిపారు. ఇది చివరి అవకాశమని, శుక్రవారం సమీపంలోని సచివాలయంలో డిజిటల్‌ అసిస్టెంట్‌ వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి గ్యాస్‌ కనెక్షన్‌ అందజేస్తామని తెలిపారు.

భార్యకు వేధింపులు

నెల్లూరు(క్రైమ్‌): భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతనికి సహకరిస్తున్న అత్తింటివారిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంటనగర్‌కు చెందిన కిషోర్‌ ఆటో నడుపుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. బుజ్జమ్మ రేవుకు చెందిన ఓ మహిళతో ఏర్పడిన పరిచయం సాన్నిహిత్యానికి దారితీసింది. దీంతో రెండేళ్లుగా ఆమెతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ భార్య కాంచన, పిల్లలను పట్టించుకోవడం మానేశారు. ఆమెతోనే ఉంటూ సంపాదించిన మొత్తాన్ని ఇవ్వసాగారు. దీంతో సదరు మహిళ ఇంటి వద్దకు కాంచన వెళ్లి భర్తను పంపాలని కోరారు. దీనికి నిరాకరించడంతో పాటు గొడవకు దిగారు. దీంతో భర్త విషయాన్ని అత్తింటివారికి కాంచన తెలియజేశారు. న్యాయం చేయాల్సిన వారు అందుకు భిన్నంగా అతనికే వత్తాసు పలికారు. అందరూ కలిసి ఆమెను చిత్రహింసలకు గురిచేయసాగారు. వేధింపులను తాళలేని కాంచన పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటివారిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడు పంచాయతీ శ్రీరంగరాజపురానికి చెందిన మాధవి, మనోహర్‌కు 2015లో వివాహమైంది. ఆ సమయంలో మాధవి కుటుంబసభ్యులు రూ.లక్ష నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలను మనోహర్‌కు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. భర్త, అత్తింటివారు ఆమెను సూటిపోటి మాటలతో వేధించేవారు. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కౌన్సెలింగ్‌ చేశారు. భర్త, అత్తింటివారు ఆమెను ఇంటి నుంచి ఇటీవల గెంటేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

కోవూరు: రాజమండ్రిలో గత నెల 31వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ బాక్సింగ్‌ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి అండర్‌–17, అండర్‌–19 విభాగాల్లో 8 రజత పతకాలు, 9 కాంస్య పతకాలు సాధించారు. గురువారం రాజమండ్రిలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో రుడా చైర్మన్‌ చేతులమీదుగా విద్యార్థులు పతకాలు అందుకున్నారు. పతకాలు సాధించిన వారిలో 8 మంది కోవూరు జిల్లా పరిషత్‌ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉండడంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహ, ఫిజికల్‌ డైరెక్టర్‌ దేవిక, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు. అండర్‌–17 విభాగంలో జగదీశ్‌సింగ్‌(కోవూరు), హరిత(పెనుబల్లి), సునయన(కేంద్రీయ విద్యాలయం), ఎస్కే అబ్దుల్‌ రజియా సుల్తాన్‌ (సెయింట్‌ జోసెఫ్‌ స్కూల్‌), సుమాసన (కేంద్రీయ విద్యాలయం), ధోని(కోవూరు), హర్షిణి(కోవూరు), కీర్తన(కోవూరు), అండర్‌–19 విభాగంలో ప్రవల్లిక(వెండి), ముంతాహా(కాంస్య), మాళవిక(వెండి), నాగమణి(కాంస్య), వైజయంతి(కాంస్య), నమ్రత(కాంస్య), పూజిత (వెండి), సల్మా(వెండి) పతకాలు సాధించారు.

పెరిగిన నిమ్మధరలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

- బస్తా కాయలు రూ.2,800

పొదలకూరు: చలి తీవ్రత వల్ల నిమ్మకాయల వాడకం పడిపోయి ధరలు దిగజారిన నేపథ్యంలో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా గత రెండు రోజులుగా ధరలు పెరిగాయి. నిన్నటి వరకు టాప్‌ ధర రూ.800 కూడా పలకలేదు. అయితే ప్రస్తుతం ధరలు ఒక మోస్తరుగా పెరిగినట్టు వ్యాపారులు తెలిపారు. స్థానిక నిమ్మమార్కెట్‌ యార్డులో కిలో నిమ్మకాయలు రూ.25 నుంచి రూ.35 వరకు ధర పలుకుతున్నాయి. లూజు(బస్తా) లెక్కన పరిశీలిస్తే రూ.2 వేల నుంచి రూ.2,800 వరకు ధరలు పలుకుతున్నాయి. అయితే నాణ్యత కలిగిన నిమ్మకాయలకే ఈ ధరలు వర్తిస్తాయని వ్యాపారులు తెలిపారు. మంచు ప్రభావం వల్ల కాయల్లో నాణ్యత లోపించి రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. సంక్రాంతి వరకు తోటలకు నీరు పెట్టే అవసరం లేకుండా వర్షం కురిసినట్లు రైతులు తెలిపారు. అంతేకాక మోటార్లు వేసి తోటలకు నీరు పెట్టే అవసరం చాలామంది రైతులకు ఏర్పడలేదు. సకాలంలో వర్షాలు కురవడంతోపాటు భూమిలో తేమశాతం పెరగడం వల్ల రైతులు తోటలకు తరచుగా నీరు పెట్టుకోవాల్సిన అవసరం రాలేదు. తేమశాతం అధికంగా ఉన్నా నిమ్మచెట్లు కాపు తగ్గిపోయే అవకాశం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షానికి నిమ్మతోటల్లో నీరు నిలబడి తేమశాతం పెరిగింది. మంచు కురుస్తుండడం వల్ల కాయల నాణ్యత లోపిస్తున్నట్టు తెలుస్తోంది.

ఊపందుకుంటున్న ధరలు

జనవరి నెల చివరిలో నిమ్మ కాయల ధరలు పెరగడం ఫిబ్రవరి మొదటి వారం నుంచి కాయల ధరలు ఊపందుకునే అవకాశం ఉంది. గతేడాది వేసవిలో బస్తాకాయలు రూ.16 వేలు, కిలో నిమ్మకాయలు రూ.200 పలికాయి. ఈ ధరలు మార్కెట్‌ యార్డు ఏర్పడిన తర్వాత పలికింది లేదు. ఈ ఏడాది కూడా కాయల ధరలు ఆకాశాన్ని అంటుతాయని రైతులు ఆశపడుతున్నారు. అయితే తోటల్లో దిగుబడి తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మార్చి, ఏప్రిల్‌ మాసాల్లో రైతుల తోటల్లో కాయలు ఉంటే మంచి గిట్టుబాటు ధరలు పొంది ఆర్థికంగా బలపడే అవకాశం ఏర్పడుతుందని మార్కెట్‌ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉయ్యాలకు నిప్పు

నెల్లూరు(క్రైమ్‌): వరండాలో ఉన్న ఉయ్యాలకు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించిన ఘటన అలంకార్‌ సెంటర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. అలంకార్‌ సెంటర్‌లో నివాసం ఉంటున్న వెంకటనరసింహారావు పని నిమిత్తం తెల్లవారుజామున బయటకెళ్లారు. తలుపును దగ్గరగా వేసిన ఆయన సతీమణి నిద్రించసాగారు. ఈ క్రమంలో అటుగా వెళ్లేవారు వరండాలో ఉన్న ఉయ్యాల తగులబడుతోందని పెద్దగా కేకలేశారు. దీంతో నిద్ర లేచిన ఆమె బయటకొచ్చిచూడగా అప్పటికే ఉయ్యాల పూర్తిగా కాలిపోయింది. ఈ మేరకు చిన్నబజార్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయితేజ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆయనే ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్‌): గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై చిన్నబజార్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొర్లుకట్టకు చెందిన చెంచుకృష్ణ, మణి, మోషేకు అదే ప్రాంతానికి చెందిన కొందరితో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల వారిపై పొర్లుకట్ట తూము వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఘటనలో గాయపడిన చెంచుకృష్ణ, మణి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై లతీఫున్నీసా దర్యాప్తు చేస్తున్నారు.